క్లుప్తంగా

రేపు ఉచిత వైద్య శిబిరం

కడప రూరల్ : కడప నగరంలోని జగదీష్ న్యూరో కేర్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎండీ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. వైద్య శిబిరంలో సీనియర్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ క్రాంతిరెడ్డి అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. అలాగే శిబిరంలో షుగర్ పరీక్ష ఉచితంగా చేస్తారని, వైద్యులు సూచించిన ఇతర పరీక్షలపై 50 శాతం తగ్గింపు ఇస్తారన్నారు. అదేవిధంగా రూ. 150కే థైరాయిడ్ పరీక్షలు చేస్తారన్నారు. జులై 1 నుంచి తమ ఆస్పత్రిలో వివిధ అనారోగ్య సమస్యలతో అడ్మిట్ అయిన సీనియర్ సిటిజన్స్‌కు, సైనికుల కుటుంబాలకు, తెల్లరేషన్‌కార్డు కలిగిన అందరికీ బెడ్ ఛార్జెస్‌పై 25 శాతం తగ్గిస్తారని ఆయన వివరించారు. తమ ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఏకాదశి, పౌర్ణమి పూజలలో పాల్గొనండి

కడప సెవెన్‌రోడ్స్ : తొలి ఏకాదశి, ఆషాడ శుద్ధ పౌర్ణమి సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలోని గడ్డిబజారు శ్రీలక్ష్మి సత్యనారాయణ స్వామి దేవస్థానంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు విజయ్‌కుమార్‌భట్టర్ తెలిపారు. ఆదివారం ఆషాడ మాస తొలి ఏకాదశి సందర్భంగా శ్రీ లక్ష్మిసత్యనారాయణస్వామికి ఉదయం 7 గంటల నుంచి విశేష ఆరాధన, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం, గ్రామోత్సవం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించనున్నారు. అలాగే ఈనెల 10వ తేది ఆషాడ శుద్ధ పౌర్ణమి సందర్భంగా సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నామన్నారు. భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి పూజలలో పాల్గొనాలన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని గౌస్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఇటీవల హైస్కూల్‌గా ఉన్నతీకరించారని కాకపోతే అందుకు తగ్గ వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని 27వ డివిజన్ గౌస్‌నగర్ ముస్లిం నాయకులు లయన్ పఠాన్ ఖాదర్ బాష, అమానుల్లాఖాన్‌లు పేర్కొన్నారు. ఈ విషయమై శుక్రవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. దీంతో పిల్లల విద్యాబోధనకు ఆటంకం ఏర్పడుతోందన్నారు. ఇక్కడ ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కోరారు. అలాగే మరుగుదొడ్లు, పాఠశాలలో మౌలిక వసతులను కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి మాస్‌కాపీయింగ్ అంశంలో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొన్న కమలాపురంలోని ఓ ప్రైవేటు పాఠశాల ఉండడంతో ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించారని, అయినా కూడా ఆదేశాలను ఉల్లంఘిస్తూ పాఠశాల నిర్వహిస్తున్నారని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్‌లు పేర్కొన్నారు. గుర్తింపు రద్దు చేసినా తరగతులు నిర్వహిస్తున్న ఆ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం డీఈఓకు ఏఐఎస్‌బి, పిఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ రాజేంద్రప్రసాద్, ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి గోపి, జిల్లా నాయకులు మనోజ్, సుహేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో భక్తులకు అన్నదానం

నందలూరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు శ్రీ సౌమ్యనాథ స్వామి అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు ఎద్దుల సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ స్వామి వారి కల్యాణం సందర్భంగా సీనియర్ టీడీపీ నాయకులు సోమలరాజు చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో, 12వ తేదీ రథోత్సవం రోజు రెజెన్సీ సంస్థల యజమాని జీఎన్ నాయుడు సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన అన్ని రోజులు ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, సభ్యులు గంటా వాసుదేవయ్య, జంగంశెట్టి సుబ్బయ్య, మోడ పోతుల రాము తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గంగిరెడ్డి దంపతులను శుక్రవారం కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి పరామర్శించారు. గంగిరెడ్డి ద్విచక్రవాహనంలో ప్రొద్దుటూరుకు వెళుతూ పోట్లదుర్తి వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. ప్రస్తుతం వారు ఉరుటూరులో ఇంటివద్ద విశ్రాంతి తీసుకొంటున్నారు. నరేన్ రెడ్డి శుక్రవారం ఉరుటూరుకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



సమావేశానికి హాజరైన నాయకులు



వైఎస్సార్‌సీపీ నగర కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

- పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుంటాం
- నగర కమిటీ సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా పిలుపునిచ్చారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కడప నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అన్ని కమిటీలను నియమించామన్నారు. ఈ కమిటీల్లో కష్టపడి పనిచేసే వారికి స్థానం కల్పించామన్నారు. ప్రతినెలా ఈ కమిటీలు సమావేశం కావాలన్నారు. ఈనెల 6వ తేదీ రవీంద్రనగర్‌లోని యూఎస్ మహల్‌లో కడప నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, ఆ సమావేశానికి కడప అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన అనుబంధ సంఘాల కమిటీలు, జిల్లా కమిటీలు, రాష్ట్ర కమిటీలు, జిల్లా, రాష్ట్ర అనుబంధ సంఘాల్లోని సభ్యులంతా తప్పక హాజరుకావాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని, ఒక్క సిలిండర్ మాత్రమే ఇచ్చారన్నారు. ఆ సిలిండర్ డబ్బులు కూడా 80 శాతం మందికి పడలేదన్నారు. విద్యుత్ చార్జీలు పెంచనని చెప్పి, ఏడాదిలోపే రెండు సార్లు పెంచారన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయని, ఏం కొనలేని, తినలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్లు నిండిన వారికి నెలకు రూ.15 వేలు, నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు, 50 ఏళ్లకే పింఛన్ వంటి హామీలు అటకెక్కాయన్నారు. 'తల్లికి వందనం' డబ్బులు చాలామంది తల్లుల ఖాతాలకు జమ కాలేదన్నారు. వికలాంగ పింఛన్లను రీ వెరిఫికేషన్ చేస్తూ వారి పింఛన్లు తీసేశారన్నారు. బాబు ష్యూరిటీ మోసానికి గ్యారెంటీగా మారిందని ఎద్దేవా చేశారు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బంగారు నాగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శివప్రసాద్, నగర మైనార్టీ అధ్య క్షుడు షఫీ, నగర మహిళా అధ్యక్షురాలు బండి దీప్తి, ఐస్‌క్రీం రవి, జోన్ అధ్యక్షులు బీహెచ్ ఇలియాస్, పి. రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ర్యాంకు సొంతం



కావ్యను మెమెంటోతో సత్కరిస్తున్న ప్రిన్సిపల్ ఎస్‌వీ.రమణరాజు

రాజంపేట టౌన్: బైపీసీ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే నీట్‌లో ర్యాంకు సాధించగలరని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీ.రమణరాజు తెలిపారు. టి.కావ్య అనే విద్యార్థిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివి గత ఏడాది నీట్‌లో ర్యాంకు సాధించి ప్రస్తుతం కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ప్రార్థన సమయంలో కావ్యను ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణరాజు జ్ఞాపికను అందచేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ మనిషి అనుకుంటే ఏదైనా సాధించవచ్చన్నారు. అందువల్ల విద్యార్థులు కళాశాలలో చేరిన మొదటి రోజు నుంచి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదివితే ఉన్నత చదువులకు సంబంధించిన ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించగలరన్నారు. ఇందుకు కావ్యనే ఒక ఉదాహరణ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.చంద్రమోహన్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఏపీ పీటీటీ ఎంప్లాయిస్ యూనియన్ కడప డిపో కార్యదర్శి బాల వె ంకటేశ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై శుక్రవారం కడప డిపో ఆవరణంలోని ఆర్టీసీ గ్యారేజీ వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పెండింగ్ డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ అరియర్స్ వెంటనే ఉద్యోగులకు చెల్లించాలన్నారు. అలాగే ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించి వెంటనే 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగ సంఘ నాయకుడు ఎన్ఆర్ శేఖర్ మాట్లాడుతూ నాన్ ఆపరేషన్ యూనిట్లలో సీసీఎస్ డెలిగేట్ల తగ్గింపు కోసం పాలక మండలి తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని నిలుపుదల చేయాలన్నారు. అన్ని వర్క్ షాపులలో నెలవారి మూవింగ్ యావరేజ్‌ను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూవింగ్ యావరేజ్ చెల్లించాలని, జోనల్ వర్క్‌షాప్‌లలో ఒకే విధమైన బేస్ ప్రొడక్షన్ లెవెల్ టార్గెట్లు అమలు చేయాలన్నారు. వీటితో పాటు అనేక అపరిష్కృత సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కమిటీ సభ్యులు వీవీ రెడ్డి, ప్రమీలమ్మ, విల్సన్, పీవీ సుబ్బయ్య, ట్రెజరర్ శ్రీనివాసులురెడ్డి, గ్యారేజ్ సెక్రటరీ నరసారెడ్డి, నాయకులుహుసేన్ బాష, శ్రీను, గణేష్‌సింగ్, చెన్నయ్యతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్: పాలక ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలే లక్ష్యంగా ఈ నెల 22 నుండి 24 వరకు బద్వేల్‌లో జిల్లా మహాసభలు, ఆగస్టు 20 నుండి 25 వరకు ఒంగోలులో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్ 21 నుండి 24 వరకు చండీగర్ లో జాతీయ మహాసభలు జరగబోతున్నాయని, వీటిని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన నల్లధనం వెలికితీత, పన్నుల తగ్గింపు, జన్ ధన్ యోజన ద్వారా మహిళల అకౌంట్లో లక్షల జమ, ఏడాదికి 2కోట్ల ఉద్యోగాల కల్పన వంటి వాగ్దానాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యిందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను సమూలంగా మార్చి శ్రమజీవులను దోపిడీ చేసేందుకు ద్వారాలు తెరిచిందన్నారు. రాష్ట్రంలో డబల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకుంటున్న చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికలహామీ అయిన సూపర్ సిక్స్ అమలుకు నోచుకోలేదన్నారు. పెండింగులో ఉన్న ప్రాజెక్టులు పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు బి రామయ్య, ఎల్ నాగ సుబ్బారెడ్డి, పి చంద్రశేఖర్, ఎం వి సుబ్బారెడ్డి, పి సుబ్బరాయుడు, సి సుబ్రహ్మణ్యం, ఎస్ విజయలక్ష్మి, జి వేణుగోపాల్, కేసి బాదుల్లా, పి శ్రీరాములు, సావంత్ సుధాకర్ దితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను హరించేందుకు కుట్ర



పోస్టర్ ఆవిష్కరణలో మాట్లాడుతున్న గంటా నారాయణరెడ్డి

కడప అగ్రికల్చర్: ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు 9న నిర్వహించబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంటా నారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కడప డీసీసీ బ్యాంకు ఆవరణలో సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను బ్యాంకు ఉద్యోగులతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29 చట్టాలను రద్దు చేస్తూ వాటి స్థానంలో 4 ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్లను ప్రవేశ పెట్టి కార్మిక హక్కులను హరించేందుకు కుట్ర పన్నుతోందన్నారు. గతంలో 8 గంటల పని గంటలకు బదులు 12 గంటల పని దినాలు ప్రవేశపెట్టబడుతోందన్నారు. దీంతోపాటు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానంలో మాత్రమే భవిష్యత్తులో ఉద్యోగులు ఉంటారని, 300 మందిలోపు ఉద్యోగులు ఉన్న సంస్థను యాజమాన్యం నిర్భయంగా రద్దుచేయవచ్చన్నారు. 9న జరగబోయే సమ్మెకు సంబంధించి 13 డీసీసీబీల ముఖ్య కార్య నిర్వాహణాధికారులకు సమ్మె నోటీసు పంపించడం జరిగిందన్నారు. సెలవు కోసం దరఖాస్తు పెట్టాల్సిన అవసరం లేదని, కేంద్ర కార్మిక సంఘాలు, బ్యాంకు ఉద్యోగ సంఘాల చేయబోయే ధర్నా కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలియచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

రక్తదాన వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



రక్తదాన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలో రక్తదాన కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా చేపట్టిన «రక్తదాన వారోత్సవాల్లు పోస్టర్లను శుక్రవారం జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆవిష్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ ఈ రక్తదాన కార్యక్రమాలు జూలై 20 నుండి 26 వరకు జరుగుతాయన్నారు. రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టవచ్చని, ఇది ఒక గొప్ప సామాజిక సేవ అన్నారు. రక్త నిల్వలు పెంచడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర అభినందనీయమన్నారు. ఈ రక్త వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జేబీవీఎస్, విక్షిత ఫౌండేషన్, చేతన ఫౌండేషన్, శ్రీ జ్యోతిబాయ్ పూలే సేవా సమితి, అమృత హస్తం సేవాసమితి, సిఆర్‌వి సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, కేర్ క్లబ్ ఫౌండేషన్, వింగ్స్ ఆఫ్ హ్యుమానిటీ సంస్థలను అభినందించారు.

అల్లూరి సీతారామరాజు యువతకు ఆదర్శనీయం

– ఇన్‌ఛార్జి డీఆర్వో వెంకటపతి



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఇన్‌ఛార్జి డీఆర్వో వెంకటపతి, అధికారులు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సురేష్ కుమార్, శివానాయక్ తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : స్వాతంత్ర్య సమరయోధులు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఈ తరం యువతకు ఆదర్శనీయమని ఇన్‌ఛార్జి డీఆర్వో వెంకటపతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి కార్యక్రమానికి ఇన్‌ఛార్జి డీఆర్వో వెంకటపతి ముఖ్య అతిథిగా హాజరై అధికారులతో కలిసి అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి డీఆర్వో వెంకటపతి మాట్లాడుతూ నేటి సమాజానికి అల్లూరి ధైర్య సాహసాలు ఆదర్శనీయమన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన మహనీయుల త్యాగాలను మరువరాదని, ఆయన ధైర్య సాహసాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి ఒక మహోజ్వల శక్తి అని, ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని చాటుకున్న విప్లవ వీరుడన్నారు.

ఈ కార్యక్రమంలో సాంఘీక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, బీసీ సంక్షేమ శాఖ డీడీ అంజన, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి పద్మజ, కలెక్టరేట్ ఏఓ విజయ్ కుమార్, టూరిజం మేనేజర్ రామ్ కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సేవలు మరువలేనివి

కడప వైఎస్ఆర్ సర్కిల్: దేశ స్వాతంత్ర్యంలో బ్రిటీష్ సామ్రాజ్య వాదాన్ని గడగడ లాడించిన అల్లూరి సీతారామరాజు సేవలు మరువలేనివని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, కదిరి ప్రసాద్ గౌడ్ లు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అల్లూరి జయంతి, మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మామిళ్ళ నరసింహులు, షేక్ నీలం, కమాల్ బాష, తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో....

అల్లూరి స్ఫూర్తితో జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పోరాడుదామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని నిహార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో అల్లూరి జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అల్లూరి జీవితం ఆదర్శనీయం

కడప రూరల్ : అల్లూరి సీతారామరాజు జీవితం ఆదర్శనీయమని జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఆఫీసు సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, ఆలిండియా బంజార సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి శివానాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆ శాఖ జిల్లా కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుక్కే జగన్‌రాథోడ్, నాగేశ్వరరెడ్డి, చిన్నారావు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: కామ్రేడ్ అల్లూరు సీతారామరాజు సేవలు మరువలేనవని, 27 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ పరాయి పాలకులకు ఎదురొడ్డి నిలిచిన గొప్ప వ్యక్తి అని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర అన్నారు. శుక్రవారం కడపలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా, నగర నాయకులు మహేష్, దిలీప్ రెడ్డి, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల గ్రామోత్సవం



పెద్దపుత్త గ్రామంలో పీర్ల గ్రామోత్సవం

వల్లూరు : మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పీర్ల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దపుత్త, తప్పెట్ల, దిగువపల్లె తదితర గ్రామాల్లో గ్రామోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు, పిల్లలు ప్రత్యేకంగా అలంకరించిన పీర్లను పట్టుకుని డప్పు వాయిద్యాలు, దివిటీల వెలుగుల మధ్య గ్రామంలోని వీధులలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పీర్లకు చక్కెర, పప్పులు, బెల్లంలను ప్రసాదంగా సమర్పించి అందరికీ పంచిపెట్టారు. రాత్రి పెద్ద గుండం కాల్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక ఫాతెహా నిర్వహించి పానకాన్ని అందరికీ పంచి పెట్టారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నియంత్రణ



ప్రజలతో మాట్లుడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

చింతకొమ్మదిన్నె : పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నియంత్రణ సాధ్యమని ప్రజలు గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు శుక్రవారం ఊటుకూరులో జరుగుతున్న ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు గ్రామంలోని ప్రతి ఒక్కరూ వారానికి ఒకసారి నీటితొట్లు, కుండలు, బానలు శుభ్రం చేసుకోవాలన్నారు. నీరు ఎక్కువ రోజులు నిలువ ఉంటే దోమలు గుడ్లు పెట్టి ఎక్కువ దోమలు వృద్ధి అవుతాయన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలు, నీరు నిలబడకుండా జాగ్రత్తగా వుండాలన్నారు. దోమలు కుట్టకుండా రాత్రి పూట దోమ తెరలు వాడాలని, మురికి కాలువలలో చెత్త వేయవద్దన్నారు. కార్యక్రమంలో స్థానిక పి.హెచ్.సి వైద్యులు మానస, మెడికల్ ఆఫీసర్, వెంకటరెడ్డి, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించండి



మినుము పంటను పరిశీలిస్తున్న కేవీకే కో ఆర్డినేటర్ వీరయ్య

కమలాపురం : రైతులు తాము సాగు చేసిన పంట పొలాల్లో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కేవీకే కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ సెంటిస్ట్ డాక్టర్ వీరయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని దేవరాజుపల్లె గ్రామంలో సాగులో ఉన్న మినుము పంటను ఆయన పరిశీలించి మట్లాడారు. సాగు భూమి చౌడు బారడం వలన భూమిలోని పోషకాలు మొక్కకు సరైన స్థాయిలో అందక ఎండిపోతున్నాయని వివరించారు. దీని నివారణకు పూత దశకు ముందు 19-19-19 పదిరోజుల వ్యవధిలో రెండు సార్లు లీటర్ నీటికి 5 గ్రాముల చొప్పున పిచికారి చేసుకోవాలన్నారు. పూత దశలో 13-0-45 లేదా మల్టీకే 10 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మినుము పంటలో వైరస్ తెగులు అధికంగా వ్యాప్తి చెందిందని, పంట దశను బట్టి రసం పీల్చే పురుగుల ఉధృతిని నివారించడానికి 0.4 మి.లీ ఈమిడా క్లోక్రిడ్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి, రైతులు పాల్గొన్నారు.

రైళ్లలో పోలీసుల తనిఖీలు



రైలులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా ఈగల్ టీం జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. కడప రైల్వే స్టేషన్ తోపాటు ఎర్రగుంట-కడప మార్గంలో ముంబై నుంచి చెన్నై ఎగ్మోర్ వెళ్తున్న రైలులో కడప మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామి రెడ్డి ఆధ్వర్యంలో ఈగల్, రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్, స్పెషల్ పార్టీ, పోలీసు, డాగ్ స్క్వాడ్ టీంలతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బాలస్వామిరెడ్డి మాట్లాడుతూ జనరల్ బోగి నుంచి ఏసీ బోగీల వరకు అన్నింటినీ తనిఖీ చేయడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలన కొరకు ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబర్ 1972 ఏర్పాటుచేశారని, ఈ నెంబర్‌కు సమాచారం అందిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ తనిఖీలలో కడప వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, కడప రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, స్పెషల్ పార్టీ, ఈగల్ టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.